

భీం ఆశయం నెరవేరేదెన్నడో!

ఆదివాసీలకు హక్కులకోసం నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన గిరిజనుల ముద్దుబిడ్డ కుమురంభీం. ఆయన ఆశయం మాత్రం ఇప్పటికీ నెరవేరలేదు. 8లో▸



పరీవాహకంపై పట్టింపేది?

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తినప్పుడు పరీవాహక ప్రాంతాలను అప్రమత్తం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3 /23.6

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కరాటే గ్రేడింగ్ పరీక్షలో ప్రతిభ



పురస్కారం స్వీకరిస్తున్న కిన్నెర్ల మృణాళిని

నిర్మల్‌ఖిల్లా: కరాటే బెల్ట్ గ్రేడ్ పరీక్షలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొట్టమొదటి మహిళా శిక్షకురాలు, నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కిన్నెర్ల మృణాళిని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాపోలు సుదర్శన్ నేషనల్ బ్లాక్ బెల్ట్ (4వ డాన్) తీసుకున్నారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్‌భాటియా, జిల్లా అధ్యక్షుడు కొండాజి శ్రీకాంత్, అమ్ముల భూషణ్, చందుల స్వామి, శ్రీరాముల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీవర్షం



నిర్మల్: జిల్లాను వర్షం వెంటాడుతూనే ఉంది. వాతావరణశాఖ ఆరంజ్ అలర్ట్ అంటూ శనివారం హెచ్చరికలు జారీచేయగా, ఆదివారం జిల్లా కేంద్రంతోపాటు భైంసా, ఖానాపూర్ ఏరియాల్లో వర్షం కురిసింది. నిర్మల్‌లో సాయంత్రం గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నిలకడగా కడెం నీటిమట్టం



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.500 అడుగులు ఉంది. ఆదివారం ప్రాజెక్టును చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చారు. ప్రాజెక్టులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఉల్లాసంగా గడిపారు.

నిండా మునిగిన సోయా రైతు



ఈ ఫొటోలోని రైతు పేరు మనోహర్‌పటేల్. తనకున్న ఆరెకరాల్లో తొమ్మిదేళ్లుగా సోయా పంట సాగుచేస్తున్నాడు. గత ఏడాది ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈయేడు సోయా సాగు చేశాడు. ప్రస్తుతం పంట కోయిస్తున్నాడు. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోయింది. దిగుబడి ఎందుకు తగ్గిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట
- పూర్తిగా తగ్గిపోయిన దిగుబడి
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి

సోయా సాగు విస్తీర్ణం : 1.05 లక్షల ఎకరాలు

రైతులు 72,300

మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,328



ముధోల్ మండలం ముద్గల్‌లో దెబ్బతిన్న సోయాపంట

భైంసా: భారీ వర్షాలు జిల్లాలో సోయా రైతును నిండా ముంచాయి. భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టాలు చవిచూశారు. దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో వర్షాలు అనుకూలంగా ఉంటాయని భావించారు. కానీ పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వానలు పంటను దెబ్బతీశాయి. ముధోల్ నియోజకవర్గంలో 80 శాతం మంది రైతులు సోయా సాగు చేశారు. తమకు పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో..

జిల్లాలో మొత్తం 1.05 లక్షల ఎకరాల్లో సోయా సాగు చేశారు. విత్తనాలు వేసినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురిశాయి. గతంలో నీటి తడి ఇవ్వాల్సి వచ్చేది. ఈసారి అలాంటి అవసరం లేదు. ఫలితంగా పంట బాగా పెరిగింది. రైతులు సంతోషించారు. పూత దశలో మరోసారి వర్షం కురవడంతో దిగుబడి పెరుగుతుందని ఆశపడ్డారు. అయితే, అధిక వానలు పంటను దెబ్బతీశాయి. తేమకు ఆకులు, పూత రాలిపోయేలా చేశాయి. ఇప్పుడు కోత సమయంలో దిగుబడి బాగా తగ్గింది.

ఎకరాకు రూ.23 వేల పెట్టుబడి..

ఒక్కో ఎకరానికి విత్తనాల నుంచి కోత వరకు రూ.23 వేలు ఖర్చయింది. ప్రస్తుత మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 4 వేల నుంచి రూ.4,600 వరకు ధర ఉంది. భైంసాలోని గాంధీగంజ్‌లో సోయా విక్రయాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఈ ఏడు క్వింటాల్‌కు రూ.5,328 మద్దతు ధరను ప్రకటించింది. అయినప్పటికీ, తక్కువ దిగుబడి కారణంగా పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు.

తడిసిన సోయా



కిర్గుల్(కె) గ్రామంలో సోయపంట తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

బాసర: బాసర మండల కేంద్రంలోని రైతులు కల్లాల్లో ఆరబోసిన సోయా పంట ఆదివారం కురిసిన వర్షానికి తడిసింది. ఇప్పటికే గతనెలలో కురిసిన వర్షానికి దిగుబడి తగ్గిపోయింది. సోయా, పత్తి, వరి పంటలు నీటమునిగాయి. ఇప్పుడు చేతికి వచ్చిన సోయా దిగుబడిని ఆరబెట్టగా మళ్లీ వర్షం కురవడంతో తడిసింది. పంటను కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్లు కప్పారు.

దశాబ్దకాలంగా సాగు..

గత దశాబ్దంగా ఈ ప్రాంతంలో సోయా సాగు ప్రాచుర్యం పొందింది. తక్కువ కూలీలతో, త్వరగా పంట చేతికి వచ్చేలా ఉండటంతో రైతులు దీని వైపు మొగ్గు చూపారు. కానీ ఈ ఏడు గతంలో లేని విపత్తు సంభవించింది. పంటను పూర్తిగా దెబ్బతీసి, రైతులను కోలుకోలేని స్థితికి తెచ్చింది. పూత, కాయల దశల్లో మొక్కలు రోగనిరోధకతను కోల్పోయాయి. నాలుగు నెలలు కష్టపడినా, ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కోతలు షురూ..

నాలుగు రోజులుగా జిల్లాలో సోయా కోతలు మొదలయ్యాయి. హార్వెస్టర్ల సాయంతో పంటను కోస్తున్నారు. ఎకరానికి కేవలం రూ.2 నుంచి 3 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తోంది. కాయల దశలో గింజలు పూర్తిగా నిండలేదు. విత్తన కంపెనీలతో చర్చించి, పరిస్థితిని వివరించి నష్టాన్ని భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు. సాధారణంగా సోయా పంటకు రెండు సార్లు మందులు పిచికారీ చేసేవారు. విత్తనాలు వేసిన తర్వాత గడ్డి మందు ఒకసారి, పూత, కాయల దశలో తెగుళ్ల నివారణకు మరోసారి. అయితే ఈ ఏడు 3 నుంచి 4 సార్లు పిచికారీ చేయాల్సి వచ్చింది.

కష్టం వృథా..



మా కుటుంబమంతా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తాం. ఏటా సోయా పంటవేస్తాం. ఈయేడు కూడా సోయాపంట సాగుచేశాం. ఎకరానికి రూ.23 వేలు ఖర్చుఅయింది. ప్రస్తుతం పంట కోశాను. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీంతో రూ.15 వేలు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు.

– మహమూద్, రైతు

కోతలు ప్రారంభం

జిల్లాలో సోయాపంట కోతలు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలతో పంటకు తెగుళ్లు సోకాయి. ఈయేడు సోయాపంట కొంత దెబ్బతింది. పూర్తిస్థాయిలో పంటకోస్తే దిగుబడి తెలుస్తుంది. భారీ వర్షాలు కురిసిన వెంటనే కొంత మంది రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ఏఈఓలు కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు సలహాలు ఇచ్చారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఆలస్యంతో.. అర్హత!

- గత పంచాయతీ ఎన్నికల్లో లెక్కలు సమర్పించని 1,058 మంది
- వారందరిపైనా అనర్హత వేటేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 2024 ఏప్రిల్‌తో ముగిసిన నిషేధం కాలపరిమితి
- స్థానిక ఎన్నికల ఆలస్యంతో పోటీకి సిద్ధం



అనర్హత వేటుపడిన అభ్యర్థుల వివరాలు

సర్పంచులు	125	వార్డు సభ్యులు	870
ఎంపీటీసీలు	59	జెడ్పీటీసీలు	4

నిర్మల్‌చైన్‌గేట్: 'ఆలస్యం అమృతం విషం' అంటారు పెద్దలు.. చేయవలసిన పనిని సరైన సమయంలో చేయకపోతే, అది అనర్థాలకు దారితీస్తుంది. మంచి ప్రయోజనాలు సైతం చెడుగా మారతాయి. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వం చేసిన ఆలస్యం.. గత ఎన్నికల్లో ఎన్నికల ఖర్చు వివరాలు వెల్లడించక అనర్హతకు గురైనవారికి అమృతంగా మారింది. ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో అనర్హత వేటు పడిన అభ్యర్థులు పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది.

ఎన్నికల ఖర్చు వివరాలు ఇవ్వక..

2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన కొందరు నిర్దేశిత గడువులోగా ఖర్చుల వివరాలు సమర్పించలేదు. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం వారిపై మూడేళ్ల నిషేధం విధించింది. ఎన్నికల నిర్వహణలో జాప్యం కారణంగా ఆ కాలపరిమితి ముగిసింది. దీంతో వారు మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నారు. మరోమారు ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సన్నద్ధమవుతున్నారు.

మూడు దశల్లో ఎన్నికలు..

2019 జనవరిలో జిల్లాలో 396 గ్రామ పంచాయతీలకు 3,368 వార్డులకు మూడు దశలుగా ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గాల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1న ముగిసింది. వెంటనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం కూడా 2024 ఆగస్టు మొదటి వారంలో ముగిసింది. పరిషత్‌లోనూ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే జిల్లాలో అనర్హతకు గురైనవారు పోటీకి దూరమయ్యేవారు.

1,058 మందిపై వేటు

జిల్లాలో మొత్తం 1,058 మందిపై ఈసీ మూడేళ్ల అనర్హత వేటు వేసింది. వీరు 2024 ఏప్రిల్ వరకు ఏ ఎన్నికల్లోనూ పాల్గొనకుండా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఆలస్యం కావడంతో నిషేధ కాలం ముగిసింది. తాజాగా ఎన్నికల సంఘం ఈ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ ప్రకటించింది. దీంతో నిషేధం ముగిసినవారు పోటీకి సిద్ధమవుతున్నారు.

లెక్కలు చూపాల్సిందే..

నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం 2019 జనవరిలో 396 గ్రామ పంచాయతీలకు, మేలో 157 ఎంపీటీసీలు, 18 జెడ్పీటీసీ పదవులకు ఎన్నికలు జరిగాయి. పోటీ చేసిన అభ్యర్థులు ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా ప్రచార ఖర్చుల లెక్కలు నిర్దేశిత ఫార్మాట్‌లో ఎంపీడీవో కార్యాలయాల్లో సమర్పించాలి. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల్లో వార్డు సభ్యులు రూ.30 వేల వరకు, సర్పంచ్ అభ్యర్థులు రూ.1.5 లక్షల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. 5 వేలకు మించిన జనాభా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యులు రూ.50 వేలు, సర్పంచ్ అభ్యర్థులు రూ.2.5 లక్షల వరకు ప్రచారానికి వెచ్చించే వెసులుబాటు కల్పించారు. గెలిచినా, ఓడినా పోటీ చేసినవారంతా ఖర్చుల వివరాలు వెల్లడించాలి. కొందరు వార్డు సభ్యులు విజయం సాధించినా నిర్లక్ష్యంతో సమర్పించలేదు. ఓడిపోయిన మరికొందరు నిబంధనలను ఉల్లంఘించారు. ఈసీ పలుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. దీంతో ఎంపీడీవోల నివేదికల ఆధారంగా 2021 నవంబర్‌లో అనర్హత ఉత్తర్వులు జారీ చేసింది.

నేటి ప్రజావాణి రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

వ్యక్తిత్వ నిర్మాణంతో సమగ్రత



మాట్లాడుతున్న వరంగంటి శ్రీనివాస్

నిర్మల్‌ఖిల్లా: వ్యక్తిత్వ నిర్మాణంతోనే దేశ నిర్మాణం జరిగి సమగ్రత సిద్ధిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ సహ కార్యవాహ వరంగంటి శ్రీనివాస్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దివ్య నగర్ బస్తీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏఎన్.రెడ్డి కాలనీ క్లబ్ హౌస్‌లో ఆదివారం విజయదశమి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు. హిందువులలో ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పొద్దుటూరి గంగారెడ్డి, నిర్మల్ నగర సంఘ చాలక్ డాక్టర్ తుమ్మల ప్రమోద్ చంద్రారెడ్డి, స్వయం సేవకులు, దివ్యనగర్ బస్తీ వాసుల పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతకే పంచపరివర్తన్

హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని జిల్లా ధర్మజాగారణ టోలి సభ్యులు బ్రహ్మబట్ రాజేశ్‌సింగ్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వివేక్ నగర్ బస్తీ ఆధ్వర్యంలో స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో విజయదశమి నిర్వహించారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో చింతపండు రవి, నగర కార్యవాహ కిన్నెర్ల రవి, మల్లికార్జున్ రెడ్డి, కూనప్రవీణ్, రఘునందన్ రెడ్డి, ధీరజ్, సైండ్ల శ్రీధర్, గోవర్ధన్, నరేశ్, శంకర్, టీఎస్.స్వామి పాల్గొన్నారు.

దొంగల భయంతో గస్తీ



గస్తీ, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి సమావేశం ఏర్పాటు చేసుకున్న వేంకటేశ్వర్ కాలనీవాసులు

బాసర: బాసర పట్టణంలోని శ్రీవేంకటేశ్వర కాలనీలో వరుస దొంగతనాలు స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. చీకటిపడితే చాలు ఏ ఇంట్లో దొంగలు పడతారో అని ఆందోళన చెందుతున్నారు. తెల్ల వారితే ఏం వార్త వినాల్సి వస్తుందో అని భయపడుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా చోరీలు ఆగడం లేదు. దీంతో భద్రతా చర్యల కోసం కాలనీవాసులే ముందుకువచ్చారు. రోజుకు ఐదుగురు చొప్పున యువకులు ఐదు బృందాలుగా ఏర్పడి గస్తీ కాస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం పోలీసులకు అందిస్తున్నారు. పట్టణంలో పోలీసులు ఉన్నప్పటికీ దొంగలను పట్టుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇక శాశ్వత ఉపాధి కార్డులు

నిర్మల్‌చైన్‌గేట్: ఉన్నత చదువులు పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ ఎన్నికల రిజిస్ట్రేషన్‌లాగే ఉపాధి కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని ప్రభుత్వం సూచించింది. గతంలో మూడేళ్లకోసారి ఎంప్లాయిమెంట్ కార్డు రెన్యూవల్ చేయాల్సి ఉండేది. ఇప్పుడు ఒక్కసారి నమోదు చేసుకుంటే చాలు, ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వరకు అది చెల్లుబాటు అవుతుంది.

ఒకే రోజులో జారీ

జిల్లా ఉపాధి శాఖలు ఇప్పుడు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఒక్కరోజులోనే శాశ్వత కార్డులు జారీ చేస్తున్నాయి. రెన్యూవల్ లేకపోవడంతో సీనియారిటీ కోల్పోయే ఇబ్బంది తొలిగింది. ఇప్పటికే అనేక మంది కొత్తగా నమోదు చేసుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో సులభంగా..

ఉపాధికార్డు కోసం అభ్యర్థులు employment.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కళాశాలల్లోనూ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వెంటనే అప్రూవ్ చేస్తున్నారు. వివరాలకు జిల్లా ఉపాధి శాఖను లేదా 9652707401, 9014882266 నంబర్లను సంప్రదించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వ శాఖల్లో ఖాళీల సమాచారం జిల్లా ఉపాధికల్పన కార్యాలయానికి అందుతుంది. ఉపాధి కార్డు పొందిన సీనియర్లకు మొదట ప్రాధాన్యమిస్తారు. విద్యార్హతలను బట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీల వివరాలను అభ్యర్థులకు మెయిల్ ద్వారా అందిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

– బి.గోవింద్, ఉపాధికల్పన శాఖ అధికారి

దసరా సెలవుల్లో రెచ్చిపోయిన దొంగలు

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు..
- పక్ష రోజులుగా జిల్లాలో రోజుకో ఘటన
- పోలీసులకు చెమటలు పట్టిస్తున్న దొంగలు

నిర్మల్‌టౌన్: బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు కళాశాలలకు సెలవులు ఇచ్చారు. తెలంగాణలో పెద్ద పండుగ కావడంతో అందరూ ఇళ్లకు తాళం వేసి సొంత ఊళ్లకు, బంధువుల ఇళ్లకు, తీర్థయాత్రలకు వెళ్లారు. ఇదే అదనుగా జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలు, ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలే లక్ష్యంగా దొంగతనాలు చేశారు. తమ చోరకళను ప్రదర్శిస్తూ పోలీసులకు చెమటలు పట్టించారు.

రోజుకో చోరీ వెలుగులోకి..

జిల్లాలో దసరా సెలవులు మొదలైన నాటి నుంచి రోజుకో పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలు జరిగాయి నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో ఒకటికి మించి దొంగతనాలు జరిగాయి. నగదు, బంగారం, విలువైన వస్తువులు, బైక్‌లు, స్కూటర్లు వరకు ఎత్తుకెళ్లారు.



బాసరలో సీసీ ఫుటేజీలో అనుమానితులు (ఫైల్)

పోలీసులకు చిక్కకుండా..

నిఘా వ్యవస్థ అభివృద్ధి చెందినా, దొంగలు చోరీ చేసిన ఇళ్లలో ఎలాంటి ఆనవాళ్లు వదలలేదు. రాత్రింబవళ్లు గస్తీ ఉన్నా, పోలీసుల కంట పడకుండా దొంగలు తమ పని కానిచ్చేశారు. కొన్ని నెలలుగా జిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాలతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పక్క రాష్ట్ర గ్యాంగులేనా?

నిర్మల్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దును ఆనుకుని ఉండడం, 44, 61 జాతీయ రహదారుల ద్వారా తరచుగా రాకపోకలు సాగడంతో పక్క రాష్ట్రాల గ్యాంగులు వచ్చి దొంగతనాలు చేసి పారిపోతున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఈ దిశగా పోలీసులు విచారణను ముమ్మరం చేస్తున్నారు. అయితే దొంగలు మాత్రం పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.

పగలు రాత్రి తేడా లేకుండా..

ఇప్పటివరకు ఎక్కువగా రాత్రులే దొంగతనాలు జరిగినప్పటికీ, ఈసారి పగలు రాత్రి తేడా లేకుండా దొంగలు రెచ్చిపోయారు. పగలే ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేశారు. ఇంటి బయట నిలిపిన వాహనాలూ ఎత్తుకెళ్లారు.

సెప్టెంబర్ 21 నుంచి జరిగిన చోరీలు కొన్ని..

- సెప్టెంబర్ 21న బాసరలో దొంగలు హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి బస్ స్టాండ్ వద్ద ఉన్న శారద బేకరీ షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి నగదు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 22న తానూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వైన్ షాపు వెనుక భాగం నుంచి ఉన్న రేకులను తొలగించి లోనికి చొరబడి రూ.లక్ష విలువైన మద్యంతోపాటు, రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- ఇటీవలే లక్ష్మణచాంద మండలం రాచపూర్‌లో రవి అనే వ్యక్తికి చెందిన బైక్‌ను ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 25న తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో దొంగలు తాళం వేసిన ఇంట్లో చోరీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్ చందర్‌గౌడ్ ఇంటికి తాళం వేసి మహారాష్ట్రలోని కూతురు ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున దొంగలు ఇంట్లో చొరబడి ఐదున్నర కేజీల వెండి, తులంనర బంగారు ఆభరణాలు చోరీ చేశారు. అదే రోజు ఈద్గాం వద్ద ఇంటి బయట నిలిపి ఉంచిన బైక్‌ను ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 25న భైంసా పట్టణంలోని బస్టాండ్ సమీపంలో సయ్యద్ యాకూబ్‌కు చెందిన రెడీమేడ్ వస్త్ర దుకాణం షటర్ పగలగొట్టి దొంగలు రూ.15 వేల విలువైన దుస్తులు చోరీ చేశారు. అదేరోజు మరో నాలుగు దుకాణాల్లో చోరీకి యత్నించారు.
- సెప్టెంబర్ 26న తానూర్ మండల కేంద్రంలోని గోలి బిస్కెట్ షాపు వెనుక భాగంలో ఉన్న రేకులను తొలగించి గల్లాలో ఉన్న రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 27న కుంటాల మండల కేంద్రానికి చెందిన సత్రపు సురేశ్ దంపతులు పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లారు. తెల్లవారి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటి వారు వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి బీరువా చూసేసరికి రూ.10 వేల నగదుతోపాటు, 4 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. అదే ఇంట్లో పక్క గదిలో ఉండే బ్యాంకు ఉద్యోగి ఇంటి తాళం పగలగొట్టి వస్తువులు చిందరవందరగా పడేశారు.
- సెప్టెంబర్ 29న ముధోల్ మండల కేంద్రంలోని ఎల్లమ్మ కాలనీలో నివాసముండే గంగసాగర అనే మహిళ నిజామాబాద్ షాపింగ్‌కు వెళ్లింది. వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని రూ.5 లక్షల నగదుతోపాటు, 5 తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 29 అర్ధరాత్రి బాసరలోని వేంకటేశ్వర కాలనీలో సుమారు నాలుగిళ్లలో దొంగలు చోరీకి ప్రయత్నించారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఓ మహిళ ఒక వ్యక్తితో కలిసి ఓ ఇంటి గోడ దూకిన దృశ్యం రికార్డు అయింది.
- ఈనెల 3న భైంసా పట్టణంలోని బాసర మార్గంలో ఉన్న మక్రాన టైల్స్ దుకాణంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.2.40 లక్షలు ఎత్తుకెళ్లాడు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



తాడిహత్నూర్‌లో పట్టుకున్న బియ్యం

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న పీడీఎస్ బియ్యం ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై అఖిల్ తెలిపారు. కోటగిరి విశాల్, చింతావార్ సత్యనారాయణ పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 2.80 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉచిత బియ్యం అక్రమంగా తరలించినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య



మణికంఠ మృతదేహం

లక్సెట్టిపేట: బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని క్లబ్ రోడ్‌కు చెందిన రాథోడ్ మణికంఠ (20) మంచిర్యాలలోని కళాశాలలో ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పది రోజులుగా బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను అడుగుతున్నాడు. ఈ నెల 4న సాయంత్రం బైక్ కొనివ్వాలని పట్టుబట్టడంతో కొన్నిరోజుల తర్వాత కొనిస్తామని తల్లిదండ్రులు సర్దిచెప్పారు. అయినా వినకుండా ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి దారాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ...



వినోద్ (ఫైల్)

లక్ష్మణచాంద: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన తుదిగని వినోద్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 3న మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట గ్రామ సమీపంలో ఆదివారం గుంతను తప్పించబోయి లారీ చెట్టును ఢీ కొట్టింది. జన్నారం నుంచి ఉట్నూర్ వైపు బయలుదేరిన లారీ మంచిర్యాల–ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి ప్రమాదవశాత్తు చెట్టును ఢీ కొట్టింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు. ఇటీవల ఓ ప్రైవేటు బస్సు సైతం ఈ గుంతలో పడిపోవడంతో ముందు టైర్లు ఊడిపోయిన సంఘటన నెలకొంది. పెద్ద ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరగకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఒకరిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక(11)తో అసభ్యంగా ప్రవర్తించిన ఫయ్యాజ్ ఖాన్‌పై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. నాగ్‌పూర్‌కు చెందిన ఫయ్యాజ్ అదే కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో లోనికి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించి తల్లికి సమాచారం ఇవ్వడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలం కోహినూర్(కే) గ్రామంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గంగారం తెలిపారు. మేస్రం జుగాది రావు చేనులో 6, మేస్రం గంగారాం చేనులో 4 మొక్కలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

ఇంద్రవెల్లి: చోరీ కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని మోహన్‌సింగ్‌తండాకు చెందిన రవిబాను అదేగ్రామంలో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి షాపు తెరిచి చూడగా షటర్ కొంచెం పైకి లేచి ఉంది. అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉంచిన రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మడండి రమేశ్, కనోడే విఠల్‌ను అరెస్ట్ చేసి విచారించడంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భీం ఆశయం నెరవేరేదెన్నడో!

‘జల్, జంగల్, జమీన్’ నినాదంతో భూమి, నీరు, అడవిపై ఆదివాసీలకు హక్కులకోసం నిజాం ప్రభుత్వంతో జరిపిన పోరాటంలో అసువులు బాసిన గిరిజనుల ముద్దుబిడ్డ కుమురంభీం. ఆయన మరణించి 85 ఏళ్లు కావస్తున్నా ఆశయం మాత్రం ఇప్పటికీ నెరవేరలేదు. నేటికీ గిరిజనులు తాగు, సాగునీరు, రోడ్డు సౌకర్యం, సాగు చేస్తున్న భూములకు పట్టాలులేక అలమటిస్తున్న పల్లెలు అనేకం ఉన్నాయి. ఈ నెల 7న కుమురంభీం 85వ వర్ధంతి సందర్భంగా కథనం.



ఆదివాసీలు నివాసం ఉంటున్న పెంకుటిండ్లు

- గిరిజన చట్టాలను కాలరాస్తున్న పాలకులు
- 5వ షెడ్యూల్‌కు తూట్లు
- ప్రేక్షక పాత్రలో అధికారులు
- రిజర్వేషన్లతో ఆదివాసీల్లో ఆందోళన

కడు దయనీయం

కెరమెరి(ఆసిఫాబాద్): నాటి నుంచి నేటి వరకు ఆదివాసీల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. భూమి, నీరు, అడవిపై ఇంకా హక్కులు రాలేదు. గిరిజన చట్టాలు గిరిజనేతరులకు చుట్టాలవుతున్నాయి. అప్పటి నిజాం సర్కారు ఆదివాసీ భూముల రక్షణకోసం భూ బదలాయింపు చట్టం 1/70 తీసుకువచ్చింది. కానీ అధికార యంత్రాంగం ఆదివాసీల భూముల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూములను గిరిజనేతరులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకుంటున్నారు. భూ బదలాయింపు నిషేధం ఉన్న షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరిగి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గిరిజనులు మళ్లీ అడవిలో చెట్లను నరుక్కుని బతకాల్సిన పరిస్థితులు దాపురించాయి. అందులో కూడా గిరిజనులను బతకనీయకుండా అటవీశాఖ అధికారులు తరిమేస్తున్నారు.

ఉపయోగంలోకి రాని ఐదో షెడ్యూల్

భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం అడవి, భూమి, నీటిపై గిరిజనులకు పూర్తి హక్కులు ఉన్నప్పటికీ నూతన చట్టాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయి. 2005లో బిల్లు ప్రవేశపెట్టి హక్కులను కల్పిస్తామని గత ప్రభుత్వాలు చెప్పినా అవి అమలు కాలేదు. ఐటీడీఏ నిధులతో నిర్మించిన కుంటలు, చెరువుల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలపై ఆదివాసీలకే హక్కులున్నాయని చట్టాలు చెబుతున్నా వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు. కొంత కాలంగా వలసలుగా వచ్చినవారు ఎస్టీలుగా చలామని అవుతూ నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు.



జోడేఘాట్‌లోని కుమురం భీం విగ్రహం

రిజర్వేషన్లతో ఏజెన్సీలో గుబులు

5వ షెడ్యూల్ గిరిజన చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజనేతరులకు రిజర్వేషన్‌లలో అవకాశం ఉండదు. కానీ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలోనూ గిరిజనేతరులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించారు. ఈ క్రమంలో 5వ షెడ్యూల్ అమలులో ఉండగా ఇదెలా సాధ్యమని, భవిష్యత్‌లో ఉద్యమ కార్యచరణ చేపట్టనున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

చట్టాలు పకడ్బందీగా అమలు



ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు, హక్కులు అమలు కావడంలేదు. దీంతో గిరిజన నిరుద్యోగులు, సామాన్య ప్రజలు అన్యాయానికి గురవుతున్నారు. జీవో 3 స్థానంలో మరో జీవో తీసుకువచ్చి ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. 5వ భూభాగాన్ని రక్షించాలి. – కోవ విజయ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు, కుమురంభీం ఆసిఫాబాద్

కనుమరుగవుతున్న జీవోలు

ఆదివాసీల రక్షణ కోసం ఏర్పాటు చేసిన జీవోలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు వందశాతం గిరిజనులకే చెందాలని పొందుపర్చబడ్డ జీవో 3ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఏజెన్సీలోని గిరిజనులకు 50 శాతం మించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీకి సంబంధం లేకుండా గిరిజనేతరులను భర్తీ చేసింది.

కొలాం వీరుడికి సలాం..!

నిస్సహాయులుగా, నిస్తేజంతో సతమతమవుతున్న కొలాం ఆదివాసీల్లో స్వాతంత్రేచ్ఛను రగిల్చిన ఖ్యాతి కుమురం సూరుకే దక్కుతుంది. రేపు కుమురం సూరు 28వ వర్ధంతిని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా కథనం.

- జోడేఘాట్‌లో రేపు కుమురం సూరు 28వ వర్ధంతి
- రాష్ట్రం నలుమూలల నుంచి రానున్న కొలాం ఆదివాసీలు



కుమురం సూరు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు చెందిన కుమురం చిన్ను, మారుబాయి దంపతులకు 1918లో కుమురం సూరు జన్మించారు. చిన్నతనం నుంచి అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాడు. గోండు, కొలాం జాతి ప్రజలు వెనుకబడడానికి కారణం నిజాం ప్రభుత్వమేనని గుర్తించి నిజాం నవాబులు, తాబేదారులు, రజాకార్లు కొనసాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను సహించలేకపోయాడు. తన జాతికి ఉక్కు సంకెళ్ల నుంచి విముక్తి కల్పించాలని నిర్ణయించాడు. ఆ సమయంలోనే కుమురంభీం జోడేఘాట్‌కు రావడంతో వారిలో నూతనోత్తేజం నింపింది. కొలాం, గోండులను ఏకంచేసి భీంకు అండగా నిలిచాడు. అలా సమకూరిన బలంతోనే జోడేఘాట్ పరిసరాల్లో 12 గ్రామాలు వెలిశాయి. ఆయా గ్రామాలను ఆనుకుని ఉన్న వంద ఎకరాల భూమిని ఆదివాసీలు సాగు చేస్తున్నారు. అట్టి భూములను నిజాం రజాకార్లు ఆక్రమించేవారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ నిజాం సాహెబ్‌కు మొరపెట్టుకున్న స్పందించలేదు.

జల్, జంగల్, జమీన్

ఈక్రమంలో కుమురంభీం నాయకత్వంలో జల్ జంగల్ జమీన్ నినాదంతో ఉద్యమం ప్రారంభమైంది. ఆదివాసీలపై చిత్రహింసలకు పాల్పడిన నిజాం మిలటరీతో పలుమార్లు యుద్ధం సాగింది. దీంతో 1938–40 లో ఆసిఫాబాద్ తహసీల్దార్ కుమురంభీం ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. భీం జాడ చూపాలని సూరును నిజాం మిలటరీ చిత్రహింసలు పెట్టింది. ఇలా కొన్నాళ్లు సాగిన పోరాటంలో అనేక మంది ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు. మడావి కొద్దు భీం ఆచూకీ తెలపడంతో నిజాం మిలటరీ కాల్చిచంపింది. అదే పోరాటంలో సూరు కుడి చేయి, కుడి కాలు పోగొట్టుకున్నాడు. తన ప్రాణాలు కాపాడుకునేందుకు సమతుల గుండంలో ఆరు మాసాలు అజ్ఞాతంలో ఉన్నాడు.



జోడేఘాట్‌లోని కుమురం సూరు విగ్రహం

ఆదివాసీ కొలాం క్రాంతివీర్

1975లో ఐటీడీఏ ఏర్పడిన తర్వాత అధికారులతో చర్చించి కుమురంభీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు సూరు కృషి చేశాడు. 1980లో కొలాం గ్రామాలలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కొలాం ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశాడు. 1986లో ఐటీడీఏలో కొలాం అభివృద్ధి అధికారిగా సూరును నియమించారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ‘ఆదివాసీ కొలాం క్రాంతివీర్’ అనే బిరుదును ఇచ్చింది. ఆ తర్వాత 1997 ఆగస్టు 10న ఆశ్వీయుజ పౌర్ణమి రోజున ఆసిఫాబాద్ మండలం శాకన్‌గొందిలో సూరు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అధికారికంగా జోడేఘాట్‌లో సూరు 28 వర్ధంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కొలాం ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాహుల్ (ఫైల్)

గుడిహత్నూర్: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా గుమ్‌గావ్‌కు చెందిన భగ్నూరే రాహుల్ (35)కు మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన లక్ష్మీబాయితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. రాహుల్ తన భార్యతో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయని గుమ్‌గావ్‌లో ఉన్న తండ్రి బాలాజీతో ఫోన్‌లో చెప్పేవాడు. శనివారం రాత్రి తండ్రికి ఫోన్‌చేసి తన భార్యతో గొడవ జరిగిందని చెప్పి వెంటనే కట్ చేశాడు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన వ్యక్తి ఫోన్‌చేసి మీ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందించాడు. కోడలు లక్ష్మీబాయి, ఆమె తల్లి షిండే లలితపై అనుమానం ఉందని మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో రాంటెక్ వాసి..



జనార్దన్ (ఫైల్)

ముథోల్: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంటెక్ వాసి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన కొమురపెల్లి జనార్దన్ (55) మహారాష్ట్రలోని పూణేలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లాడు. శనివారం తిరుగుప్రయాణంలో ప్రైవేటు ట్రావెల్స్‌లో వస్తుండగా పూణే శివారులో మార్గ మధ్యలో హోటల్ వద్ద వాహనాన్ని ఆపారు. అయితే కాలకృత్యాలు తీర్చుకునేందుకు జనార్దన్ రోడ్డు దాటుతుండగా మహారాష్ట్రకు చెందిన వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి ఆదివారం స్వగ్రామం రాంటెక్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



మంచిర్యాలటౌన్ : జిల్లా కేంద్రంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



దస్తురాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చిన్ననాటి స్నేహితులు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు మళ్లీ 25 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–1996 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పీచరలోని ఓ ఫంక్షన్‌లో హాల్‌లో కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గాజులు వేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోగా పురుషులు శాలువాలు కప్పుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.



లక్ష్మణచాంద: పీచరలో కలిసిన 1996 బ్యాచ్ మిత్రులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని సీసీసీ కార్నర్‌లో గల స్వాతి హైస్కూల్‌లో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరాజు, అధ్యాపకులు మంజుల, మూర్తి, భాను, సత్యం, రవి, రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

బతుకమ్మ వేడుకల్లో అపశృతి

- వేర్వేరు చోట్ల అస్వస్థతకు గురై ఇద్దరు మహిళలు మృతి



రుషిత (ఫైల్)



భాగ్యలక్ష్మి (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పహాడ్ గ్రామానికి చెందిన రుషిత (22) శనివారం రాత్రి బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అందరితో కలిసి వేడుకల్లో పాల్గొన్న మహిళ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించే లోగానే మృతి చెందింది.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన బిట్లింగ్ భాగ్యలక్ష్మి (56) శనివారం బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై కుప్పకూలింది. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. డీజే సౌండ్ కారణంగానే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కుటుంబ తగాదాలతో యువకుడి బలవన్మరణం



బీరేష్ (ఫైల్)

వేమనపల్లి: కుటుంబ తగాదాలతో ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాజారం గ్రామంలోని కుర్మగూడెంకు చెందిన దైవాల బీరేష్ (22) తాత మల్లయ్య గతేడాది మృతి చెందగా శనివారం 9 నెలల మాసికం కార్యక్రమం నిర్వహించారు. భోజనాల అనంతరం కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన బీరేష్ సాయంత్రం ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని ఎల్లమ్మ గుట్ట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి మొండి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి

ముథోల్: ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన సయ్యద్ కాశీం అలీ (54) పంటచేను చెరువుపక్కనే ఉంది. ఆదివారం ఉదయమే పొలానికి వెళ్లిన అలీ స్నానం చేసేందుకు చెరువులో దిగడంతో ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఒకరిపై పీడీయాక్టు



చర్లపల్లి జైలుకు తరలిస్తున్న సీఐ

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన అల్తాపొపై ఆదివారం పీడీయాక్టు కేసు నమోదు చేసినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. నిందితుడు గతంలో అటవీ అధికారులు, పోలీసులపై దాడి చేయడంతో ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో 11 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడు కొంతకాలంగా పలు కేసుల్లో ప్రధాన పాత్ర పోషిస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు.

50 ముఖాల దుర్గామాత నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకువచ్చిన దుర్గామాత

బాసర: నిజామాబాద్ జిల్లాలోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 50 ముఖాలతో ఉన్న అతిపెద్ద దుర్గామాత విగ్రహాన్ని ఆదివారం బాసర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మొట్టమొదటి సారిగా 50 ముఖాలతో ఉన్న దుర్గాదేవి అమ్మవారి విగ్రహం నదికి తీసుకురావడంతో తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి

- ఆవు, ఎద్దు మృతి
- ప్రాణాలతో బయటపడిన రైతు, మరో ఎద్దు



మృతి చెందిన ఎద్దు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమగూడెం పాతబస్తీ శివారులో ఉన్న వాగులో ఎడ్లబండి కొట్టుకు పోయిన ఘటనలో ఆవు, ఎద్దు మృతి చెందగా రైతు, మరో ఎద్దు ప్రాణాలతో బయట పడ్డారు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంబాడితండాకు చెందిన బానోత్ బలరాం పెద్దనపల్లి శివారులో పొలం పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఉన్న ఎద్దు, ఎడ్లబండిని తీసుకు వచ్చేందుకు కాలినడకన వెళ్లాడు. వెళ్తున్న క్రమంలో వాగు దాటగా మోకాలి లోతులో ఉండటంతో పొలం వద్దకు వెళ్లి ఎడ్లబండి సహా మరో ఆవును బండికి కట్టుకొని బయలు దేరాడు. వెళ్లేటప్పుడు వాగు లోతు తక్కువగా ఉండటంతో అదే నమ్మకంతో చీకట్లో వాగు దాటుతుండగా వరద ఉధృతి పెరిగి ఎడ్లబండి కొట్టుకు పోయింది. ఈక్రమంలో తనకు ఒక చెట్టు కొమ్మ దొరకడంతో పట్టుకుని ఎద్దును ఎడ్లబండి నుంచి వేరు చేసి కాపాడాడు. దీంతో ఎద్దు, మరో ఆవు ఎడ్ల బండితో సహా కొట్టుకు పోయి మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దు, ఆవు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని వాపోయాడు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు

- సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు

చెన్నూర్‌రూరల్: జిల్లాలో మామిడి సాగుపై ఆధారపడి ఎంతోమంది రైతులు జీవిస్తున్నారు. మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన అధికారి కళ్యాణి తెలిపారు. ఇప్పటి నుంచి నాలుగు నెలల కాలం మామిడి పంటకు కీలకమైందని, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పూతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అక్టోబర్ నుంచి మామిడి చెట్లకు నీరుపెట్టడం పూర్తిగా ఆపేయాలి. లేదంటే చెట్టు శాఖీయంగా బాగా పెరగడంతో పాటు పూత రావడం ఆలస్యం అవుతుంది. పూత రావడం అనేది రాత్రి పూట చల్లని వాతావరణం, పగటి పూట ఉన్న ఎక్కువ ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కనీసం 13 డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకునేలా కనీసం 15 రోజుల పాటు కొనసాగితే పూత వస్తుంది. వాతావరణ పరిస్థితులు కొమ్మల్లోని హార్మోన్ల నిష్పత్తి కొమ్మకు తగినంత వయసు అనేది పూత రావడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

పూత బాగా రావాలంటే..

పూత బాగా రావాలంటే కొత్తగా వచ్చే చిగుర్లపై 5 గ్రాములు జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాక్స్, 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు ఆశించకుండా..

అక్టోబర్ మాసం నుంచి మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్ట పరుస్తాయి. తేనె మంచు పురుగు తల్లి, పిల్ల పురుగు లేత ఆకులు, పూల కొమ్మలపై గుంపులు, గుంపులుగా చేరి రసం పీల్చుతాయి. దీంతో కాడలు, కొమ్మలు మాడి పూత, పిందె ఏర్పడదు. ఒక వేళ ఏర్పడినా బలహీన పడతాయి. దీని నివారణకు ఈ మాసంలో కార్బారిల్ 3 గ్రాములు, ఆర్గిన్ 1గ్రాము. నువాన్ ఒక మిల్లీ లీటరు, 5 మిల్లీ లీటర్ల వేప నూనె, కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు, కాండం కొమ్మల నుంచి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి. తామర పురుగు లేత కొమ్మలను ఆశించి రసంపీల్చడం ద్వారా పూకొమ్మలు రాతి రంగుకుమారి మాడి పోతాయి. నివారణకు రీజెంట్ 2 మిల్లీలీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాములను లేత కొమ్మలు, ఆకులపై పిచికారీ చేయాలి.

బూడిద తెగులుతో జాగ్రత్త... .

ఈ మాసంలో బూడిద తెగులు పూల కొమ్మలను ఆశించి నష్ట పరుస్తుంది. తెల్లని బూడిద లాంటి పొడి ఆకులు, పూత కాడలపై కనిపిస్తుంది. తెగులు సోకిన భాగాలు నల్లగా మారి ఆకులు, పూల కాడలు సక్రమంగా పెరగవు. ఈ తెగులు వల్ల పంటకు 30 నుంచి 60 శాతం వరకు నష్టం కలుగుతుంది. దీని నివారణకు మూడు గ్రాములు నీటిలో కరిగే గంధకం (సల్ఫర్)ను పువ్వు వచ్చే కాడలు, కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. హెక్సాకొనజోల్ మందును 2 మిల్లీ లీటర్లు తీసుకుని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నవంబర్ నెలలో మామిడి తోటకు బెట్ట పరిస్థితులు కల్పిస్తూ సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తోటల్లో అధిక పూత పొందవచ్చు.